సాక్షి నిజామాబాద్

బుధవారం, 8, ఫిబ్రవరి, 2023



పనులు వేగవంతం చేయాలి

పాఠశాలల్లో కొనసాగుతున్న మన ఊరు – మన బడి పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా ఆదేశించారు.

- 8లో ▸



మండలానికి 300 ఇళ్లు

మండలానికి 300 డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తామని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.5 /18.8

పొగమంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌కు ఐఏఎస్ హోదా



సుభాష్‌నగర్ : జిల్లా అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్‌కు ఐఏఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంగళవారం తెలిసింది. రాష్ట్ర సర్వీసులకు చెందిన పది మందికి ఐఏఎస్ హోదా కల్పించగా, అందులో చంద్రశేఖర్ ఉన్నారు. గత నెలలో ఢిల్లీలో రాష్ట్ర అధికా రులకు యూపీఎస్సీ ఇంటర్వ్యూ నిర్వహించింది. ఈ మేరకు చంద్రశేఖర్‌కు ఐఏఎస్ హోదా కల్పించినట్లు తెలిసింది.

నిజామాబాద్ ఏసీపీ వెంకటేశ్వర్ బదిలీ



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఏసీపీ ఎ.వెంకటేశ్వర్ బదిలీ అయ్యారు. ఆయనను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. అయన ఏడాదిన్నరకు పైగా ఆయన నిజామాబాద్ ఏసీపీగా విధులు నిర్వర్తించారు. ఆయన స్థానంలో టాస్క్ ఫోర్స్ ఏసీపీగా ఉన్న ఎం.కిరణ్ కుమార్‌ను నియమించారు.

డెరెక్ట్ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నిక



నిజామాబాద్ సిటీ : ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ నేషనల్ డైరెక్ట్ కౌన్సిల్ మెంబర్‌గా మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ విశాల్ ఆకుల ఎన్నికయ్యారు. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో గత సోమవారం ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ ఎన్నికలు జరగ్గా మంగళవారం ఫలితాలు వెలువడ్డాయి.


తల్లిని హతమార్చిన తనయుడు

- వ్యవసాయ భూమిని విక్రయించనందుకు ఘాతుకం



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ని గండిమాసాని పేట లో కన్న తల్లిని హతమార్చాడు తనయు డు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చి పోచమ్మ (57) పేరిట మూడెకరాల వ్యవసాయ భూమి ఉండగా దాంట్లో రెండు నెలల క్రితం నాలుగు గుంటల భూమి అమ్మి కొడుకు సంజీవులు చేసిన అప్పులను తీర్చింది. మళ్లీ రెండెకరాల భూమిని విక్రయిద్దామని సంజీవులు అనడంతో తల్లీకొడుకుల మధ్య సోమవారం రాత్రి గొడవ జరిగింది. మంగళవా రం వేకు వ జామున తల్లి పోచమ్మ ముఖంపై మెత్తపెట్టి ఊపిరాడకుండా చేసి సంజీవులు హత మార్చాడు. తర్వాత సంజీవులు తన అక్క సాయవ్వకు తల్లి మృతి చెందిన విషయం తెలుపగా ఆమె వచ్చి సంజీవులును నిలదీసింది. స్పందించకపోవడంతో సాయవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొద్ది సంవత్సరాల క్రితం ఆర్మూర్ ప్రాంతానికి కూలీ పనుల నిమిత్తం వలస వెళ్లిన సంజీవులు మరో వర్గానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. తాను చేసిన అప్పులను తీర్చే మార్గం లేక తల్లిని భూమి విక్రయించాలని కోరగా ఒప్పుకోలేదని, అందుకే హతమార్చినట్లు నిందితుడు తెలిపినట్లు పోలీసులు చెప్పారు.

కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి



నందిపేట్ (ఆర్మూర్) : నందిపేట మండలం చౌడమ్మ కొండూరు గ్రామ శివారులోని ఎల్లమ్మ చెరువు ప్రాంతంలో కృష్ణ జింకను కుక్కలు దాడి చేసి చంపేశాయి. ఫారెస్ట్ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టు మార్టం చేయించారు. అనంతరం వెటర్నరి వైద్యుడు హనుమంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సుమారు మూడేళ్ల వయస్సు ఉన్న జింక గర్భధారణతో ఉండడంతో ఎక్కువ దూరం పరుగెత్తలేక కుక్కల గుంపునకు దొరికిపోయి మృతి చెందిందన్నారు. జింక ఏడు నెలలకు ఈత పెడుతుందని, గర్భంలో మూడు నెలల పిండం ఉందని తెలిపారు. సమాచారాన్ని ఉన్నతాధికారుల కు నివేదించినట్లు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్ తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ సంతోష్ గౌడ్ రాజేందర్ సాగర్ బంగార్రాజు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఊరట



ఉపాధ్యాయుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- 317 జీవో టీచర్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్
- ఉమ్మడి జిల్లాలో 1,042 మంది అర్హులు
- 12 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఉపాధ్యాయ సంఘాల హర్షం

12 నుంచి 14 వరకు	14 నుంచి 15 వరకు	16, 17 తేదీల్లో..	18 నాడు
ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ	డీఈవోలకు హార్డ్‌కాపీల సమర్పణ	సీనియారిటీ జాబితా	తుది జాబితా

నిజామాబాద్‌అర్బన్ : ఉపాధ్యాయుల బదిలీలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీవో 317 ప్రకారం బదిలీ అయిన వారికి పూర్వ జిల్లా సర్వీస్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో బదిలీల ప్రక్రియలో మార్పులు జరగనున్నాయి. జీవో 317 ప్రకారం బదిలీ అయిన వారికి తాజా బదిలీల్లో అవకాశం ఇవ్వకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పు చెప్పింది. పాత జిల్లాలో చేసిన సర్వీసులు కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో 1,042 మంది టీచర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం బదిలీలకు సంబంధించిన షెడ్యూల్ కూడా విడుదల చేసింది. వీరి దరఖాస్తులను పరిశీలించి సర్వీస్ పాయింట్లను పరిగణనలోకి తీసుకొని బదిలీలకు అర్హులైన వారిని గుర్తించనున్నారు. ఇప్పటికే జిల్లాలో 3,014 మంది బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

కొత్త జోన్‌లు ఏర్పడటంతో గతంలో 317 జీవో ప్రకారం బదిలీలు జరిగాయి. దీని ప్రకారం నిజామాబాద్ జిల్లాకు 372 మంది టీచర్లు వచ్చారు. కామారెడ్డి జిల్లాకు 670 మంది టీచర్లు వచ్చారు. ప్రస్తుత బదీలలకు కనీసం రెండేళ్లు ఒకచోట పనిచేసిన వారే అర్హులని ప్రభుత్వం పేర్కొంది. దీంతో 317 జీవో ప్రకారం బదిలీలు అయిన వారికి కొత్త జిల్లాలో రెండేళ్ల సర్వీస్ పూర్తి కాలేదు. తాము ఉమ్మడి జిల్లా నుంచి వచ్చామని ఆ జిల్లా సర్వీసును కూడా పరిగణనలోకి తీసుకోవాలని కొందరు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. పూర్వపు జిల్లా సర్వీసును కూడా పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో నిజామాబాద్ జిల్లాలో 372 మంది, కామారెడ్డి జిల్లాలో 670 మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం కలగనుంది. వీరి పాత జిల్లాల సర్వీస్ పాయింట్లను పరిగణనలోకి తీసుకుంటే 1,042 మంది బదిలీలకు అర్హులు కానున్నారు. వీరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 12 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

హర్షణీయం



జీవో 317 టీచర్లకు పాత జిల్లాల ప్రకారం సర్వీస్ లెక్కించడం హర్షణీయం. నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

– మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

న్యాయం జరిగింది



మా సంఘం తరఫున అనేక వినతులు ఇచ్చాం. హైకోర్టు తీర్పుతో 317 జీవో టీచర్లకు మేలు జరగనుంది.

– వెనిగళ్ల సురేష్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ముున్నూరుకాపులకు అండగా ఉంటా



ముున్నూరుకాపులతో కలిసి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

నిజామాబాద్‌నాగారం : నగరంలో ఉన్న మున్నూరుకాపు సంఘాలకు, కాపులకు అండగా ఉంటానని ఏ సమస్య వచ్చినా నేరుగా రావాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. మంగళవారం శివాజీనగర్ మున్నూరుకాపు సంఘంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి శివాజీనగర్ మున్నూరుకాపు సంఘంలోని ఏడు తర్పలకు రూ.ఐదు లక్షల చొప్పున రూ.35 లక్షలు ఎమ్మెల్యే కోట కింద మంజూరు చేసి, ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో ఎన్నడూ జరగని అభివృద్ధిని 8 ఏళ్లలో చేశానన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని ఛాలెంజ్‌గా తీసుకోని పూర్తి చేశానని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి మంచి నీటిని అందిస్తామన్నారు. నగరంలో ప్రతి గల్లీలో రోడ్లు వేయించి వీధి లైట్లని ఏర్పాటు చేశామన్నారు. నగర మేయర్ దండు నీతూకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ ఆలస్యం

మోర్తాడ్ : రేషన్ బియ్యం పంపిణీకి సాంకేతిక సమస్యలు బ్రేక్ వేశాయి. ప్రతి నెలా ఒకటో తేది నుంచి బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా సర్వర్ సమస్యలతో ఆలస్యంగా మొదలు కానుంది. ఉచిత బియ్యం పంపిణీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పొడగించినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు. ఫలితంగా తనవంతు వాటా బియ్యం పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం మంగళం పలికినట్లే అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. రాష్ట్ర పౌర సరఫరాల గోదాంల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం కోటాను చేర్చినా సాంకేతిక సమస్యలు పరిష్కారం కావడంలో ఆలస్యమైంది.

బుధవారం నుంచి బియ్యం పంపిణీ మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 3,81,224 ఆహారభద్రత కార్డుల హోల్డర్లు ఉండగా, 20,940 అంత్యోదయ కార్డుదారులు ఉన్నారు. అన్నపూర్ణ కార్డుల వినియోగదారులు 1,061 మంది ఉన్నారు. వీరికి ఒక్కో యూనిట్‌కు ఐదు కిలోల చొప్పున 6,020 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయనున్నారు.

సన్నగిల్లిన ఆశలు

- పంట రుణమాఫీపై బడ్జెట్‌లో పూర్తి స్థాయి కేటాయింపులు కరువు
- రూ.90వేల లోపు ఉన్నవారికే మాఫీ ప్రకటనతో రైతుల్లో నిరాశ

మోర్తాడ్ : బడ్జెట్‌లో రుణమాఫీకి అవసరమైన మేర కేటాయింపులు జరపకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏకకాలంలో రూ.లక్ష వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు రూ.37వేల లోపు రుణం ఉన్నవారికి మాత్రమే మాఫీ చేసింది. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పూర్తి స్థాయిలో నిధులను కేటాయించకపోవడంతో అందరికి రుణ మాఫీ వర్తించే పరిస్థితి కనిపించడం లేదు. నాలుగేళ్ల నుంచి రుణ మాఫీ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ అయినప్పటికీ సగం నిధులే కేటాయించడంపై రైతుల్లో చర్చకు దారి తీసింది. రుణమాఫీ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులకు రూ.17,991 కోట్ల నిధులు అవసరం కాగా కేవలం రూ.6,380 కోట్లను కేటాయించారు. ఈ నిధులతో రూ.90వేల లోపు పంట రుణం పొందినవారికి మాఫీ చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. మెజార్టీ రైతులకు రూ.లక్షకు మించి రుణాలు ఉన్నాయి. రుణ పరిమితిని బ్యాంకర్లు పెంచడంతో ఒక్కో ఎకరానికి రూ.50వేల నుంచి రూ.80వేల వరకు పంట రుణాలు అందించారు. అనేక మంది రైతులకు రూ.3లక్షల వరకు పంట రుణాలు దక్కాయి. జిల్లాలోని 2,91,188 మంది రైతులకు రూ.1,790 కోట్ల వరకు రుణాలు మాఫీ కావాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం రుణ మాఫీకి నిధులు పెంచాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ తీరు సరికాదు

రైతులకు పంట రుణాల మాఫీ కోసం తక్కువగా నిధులు కేటాయించారు. నాలుగేళ్ల నుంచి రుణమాఫీపై ప్రభుత్వం దాటవేస్తూనే ఉంది. చివరి బడ్జెట్ లోనూ ఈ తీరు సరికాదు.

– గురిజాల నర్సయ్య, రైతు, శెట్‌పల్లి

రైతులు డిఫాల్టర్లుగా మారారు

పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అనేక మంది రైతులు బ్యాంకుల్లో రుణాలను రెన్యూవల్ చేసుకోలేదు. ఫలితంగా బకాయిదారులుగా రైతులపై ముద్రపడింది. రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

– రొక్కం మురళి, రైతు, తిమ్మాపూర్



కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

డిచ్‌పల్లి : దృష్టి లోపాలను నివారించాలని ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. మండలంలోని ధర్మారం(బి), యానంపల్లి తండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. నేత్ర పరీక్షలు చేయించుకునేందుకు ప్రతి రోజు ఎంత మంది వస్తున్నారు, కంటి అద్దాలు, మందులు సరిపడా స్టాక్ అందుబాటులో ఉన్నాయా లేవా అని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. శిబిరాల వద్ద అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. యానంపల్లితండా నర్సరీలో మొక్కలు పెంచేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. మొక్కలు నాటే సమయానికి తగిన ఎత్తుతో కూడిన వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేయాలని డిచ్‌పల్లి ఎంపీడీవో గోపిబాబుకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుదర్శనం, తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచులు మమత ఆనంద్, బలరాం, వివిధ శాఖల అధికారులున్నారు.

మన ఊరు – మన బడి పనుల తనిఖీ

రాజారామ్‌నగర్ (టీఎస్ఎస్‌పీ ఏడో బెటాలియన్)లో గల మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు –మన బడి' కింద చేపట్టిన పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. మిగిలిన పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.



కంటివెలుగు శిబిరాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

బలవంతపు రుణం

- మహిళా సంఘాలకు వద్దన్నా అంటగడుతున్న వైనం
- ఐకేపీ సీసీలకు టార్గెట్ తంటాలు



కోస్గిలో సమావేశమైన మహిళా సంఘాల సభ్యులు

ఇందూరు : ''కారణాలు చెప్తే వినే పరిస్థితి లేదిక్కడ.. మీరేం చేస్తరో తెల్వదు.. ఇచ్చిన లక్ష్యానికి అనుగుణంగా మహిళా సంఘాలకు రుణాలు అందించాల్సిందే'' ఐకేపీ సీసీలకు ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఒత్తిడి ఇది. 2022 – 23 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన బ్యాంకు లింకేజీ లక్ష్యం ఉద్యోగులకు పెద్ద సవాల్ మారింది. దీంతో మహిళా సంఘాలు తమకు వద్దన్నా బలవంతంగా లోన్లు అంటగడుతున్నారు. ఇలా అయితే సంఘాల్లో ఉండబోమని మహిళలు కూడా తేల్చి చెప్తున్నారు. రాష్ట్రంలోనే జిల్లాకు స్థాయికి మించి అత్యధిక రుణ లక్ష్యాన్ని నిర్దేశించడం తమకు తీవ్ర భారంగా మారిందని ఐకేపీ ఉద్యోగులు సైతం వాపోతున్నారు. జిల్లాకు 2022 – 23 సంవత్సరానికి తొలుత రూ.1,032 కోట్ల రుణాలు మహిళా సంఘాలకు అందించాలని సెర్ప్ శాఖ నుంచి లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ లక్ష్యాన్ని 50 శాతం కూడా చేరకముందే జిల్లాకు అదనంగా రూ.194 కోట్లు చేర్చి టార్గెట్‌ను పెంచారు. జిల్లా మొత్తం లక్ష్యం రూ.1,227.62 కోట్లకు చేరింది. ఐకేపీ ఉద్యోగులకు మరింత భారం పెరిగింది. ఇప్పటి వరకు రూ. 973.97కోట్ల రుణాలను 16,596 మహిళా సంఘాలకు అందజేశారు.

మార్చిలోగా అందించాలి

ఈ ఏడాది మార్చిలోగా ఇంకా 5,190 సంఘాలకు రూ.253.65కోట్ల రుణాలు అందించాల్సి ఉంది. ఎట్టి పరిస్థితుల్లో లక్ష్యాన్ని చేరుకోవాలని ఉన్నతాధికారులు ఏపీఎంలు, సీసీలు, వీవోఏలపై ఒత్తిడి పెంచుతున్నారు. వెనకబడిన వారికైతే రోజువారీగా లక్ష్యాలను పెట్టి రుణాలు అందజేస్తున్నారు. నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించబోమని తేల్చి చెప్తున్నారు. దీంతో సీసీలు, వీవోఏలు మహిళా సంఘాలను బతిమిలాడి రుణాలు అందజేస్తున్నారు. పాత రుణాలుండగానే కొత్త రుణాలతో బకాయిలను చెల్లించేలా చేస్తున్నారు.

కమ్మర్‌పల్లి ఫస్ట్.. వర్ని లాస్ట్..

కమ్మర్‌పల్లి మండలం నిర్దేశించిన లక్ష్యానికంటే ఎక్కువ రుణాలిచ్చి 100.19 శాతంతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. ముప్కాల్ మండలం కూడా 93.53 శాతంతో రెండో స్థానంలో ఉంది. డిచ్‌పల్లి, మోర్తాడ్, చందూర్, జక్రాన్‌పల్లి, రుద్రూర్, మోపాల్, నిజామాబాద్, వేల్పూర్, భీమ్‌గల్, ఆర్మూర్ మండలాలు 80 శాతం దాటి రుణాలిచ్చాయి. వర్ని మండలం 61.13 శాతం రుణాలిచ్చి వెనుకబడగా, మెండోరా, నవీపేట్, బాల్కొండ, ఎడపల్లి, ఏర్గట్ల, మాక్లూర్, నందిపేట్, బోధన్, రెంజల్, మోస్రా, కోటగిరి, ధర్పల్లి, ఇందల్వాయి, సిరికొండ మండలాలు కూడా వెనుకబడి ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో పని చేస్తున్న సీసీలపై అధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది.

లక్ష్యం పెరగడంతోనే..

బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం జిల్లాకు పెరిగింది. దీంతో మండలాలకు కూడా టార్గెట్ పెంచాల్సి వచ్చింది. తద్వారా లక్ష్యానికనుగుణంగా మహిళా సంఘాలకు రుణాలు అందించాలని ఏపీఎంలు, సీసీలపై ఒత్తిడి పెరిగింది. ఒత్తిడికి గురికాకుండా అవసరమున్న చోట రుణాలు అందించాలని ఇదివరకే సూచించాం.– చందర్‌నాయక్, డీఆర్‌డీవో

బడ్జెట్‌లో రూ. 1500 కోట్లే కేటాయిస్తారా?

- వడ్డీలేని రుణ బకాయిలు రూ. 6వేల కోట్లు
- బకాయిల చెల్లింపు ఎలా ?
- బీజేపీ నేత కాటిపల్లి వెంకటరమణారెడ్డి
- బతుకమ్మ ఆటలతో మహిళల నిరసన

కామారెడ్డి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి, అభయహస్తం, వడ్డీలేని రుణాలు రూ. 6వేల కోట్ల బకాయిలు ఉంటే ఈ బడ్జెట్‌లో కేవలం రూ. 1500 కోట్లు మాత్రమే నిధులు కేటాయించడం సిగ్గుచేటని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోమారు మహిళల పోరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలతో బతుకమ్మ ఆటలతో నిరసన తెలిపారు. గత బకాయిలతో కలిపి ఈ సారి బడ్జెట్‌లో రూ. 10వేల కోట్లు కేటాయిస్తారని భావిస్తే అతి తక్కువగా కేటాయించడంపై బీఆర్ఎస్‌కు మహిళలపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. గత బడ్జెట్‌లో రూ. 1,250 కోట్లు కేటాయించి ఇప్పటి వరకు పైసా ఇవ్వలేదన్నారు. బడ్జెట్‌లో తక్కువగా కేటాయించి కాకీ లెక్కలతో ఉన్న నిధులన్నీ వారి లబ్ధికోసం వినియోగించుకుంటున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. గత బడ్జెట్‌లో డ్వాక్రా మహిళలు, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగ భృతి ఇలా ఎన్నో పథకాలకు బడ్జెట్ కేటాయించి ఖర్చు చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శమన్నారు. రైతు రుణమాఫీ అని ప్రతి బడ్జెట్లో పెడుతున్నా ఇప్పటికీ మాఫీ కాలేదన్నారు. బడ్జెట్ అంతా బీఆర్ఎస్ నాయకులు లెక్కలు చెప్పుకోవడానికి సరిపోయిందే తప్పా ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని విమర్శించారు. డ్వాక్రా మహిళల ఖాతాల్లో డబ్బులు జమయ్యే వరకు రోజుకో నిరసన తెలుపుతామన్నారు. వారికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా బకాయిలను తక్షణమే చెల్లించాలని లేనిపక్షంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం అవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్, తేలు శ్రీను, లక్ష్మారెడ్డి, విపుల్, నరేందర్‌రెడ్డి, సురేష్, రాజేశ్, రవీందర్‌రెడ్డి, సిద్ధు, సాయి, అంజిరెడ్డి, భూపాల్, కల్పన, లావణ్య, ప్రతిజ్ఞ, బాలమణి, బాబు, నరేశ్, ఆంజనేయులు, నారాయణ మహిళలు పాల్గొన్నారు.



కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడుతున్న మహిళలు

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు తరలిన జిల్లా క్రీడాకారులు



కామారెడ్డి అర్బన్‌: బీహార్‌ రాజధాని పాట్నాలో ఈనెల 10, 11, 12 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో పాల్గొనడానికి కామారెడ్డి జిల్లా క్రీడాకారులు మంగళవారం బయలుదేరారు. ఈసందర్భంగా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌ మాట్లాడుతూ.. క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసి, వీడ్కోలు పలికినట్లు తెలిపారు. అథ్లెటిక్స్‌ బృందానికి కోచ్‌, మేనేజర్‌గా ఓరా అంకుష్‌ వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. దేవాలయానికి చెందిన 30 మంది

‘జోడో యాత్ర’ను విజయవంతం చేయాలి



కమ్మర్‌పల్లి: గడప గడపకు కాంగ్రెస్‌ పార్టీ చేపడుతున్న హాత్‌ సే హాత్‌ జోడో అభియాన్‌ యాత్రను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నర్సాపూర్‌లో మంగళవారం ఆయన కాంగ్రెస్‌ జెండా ఆవిష్కరించి యాత్రను ప్రారంభించి మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి రాహుల్‌ గాంధీ సందేశాన్ని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను వివరించాలన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌ బిన్‌ హందాన్‌, ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌, నగేష్‌రెడ్డి, కిసాన్‌ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, జావిద్‌ అక్రమ్‌, సుంకెట రవి తదితరులు పాల్గొన్నారు.

12నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాలోత్‌తండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 14వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్‌ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న సేవాలాల్‌ జయంతి సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. మొదటి బహుమతి రూ. 15వేలు, ద్వితీయ బహుమతి రూ. 8వేలు నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ రుసుము రూ. 500 చెల్లించి జట్లు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 11న జట్ల డ్రా తీస్తామన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు తమ ఆధార్‌ కార్డు వెంట తీసుకొని రావాలన్నారు. క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో ‘కాకతీయ’ హవా



ఎ సిదార్థ



కే సాత్విక్‌



సాయి ఆకాష్‌



అస్మిపిర్దోష్‌

నిజామాబాద్‌అర్బన్‌: జేఈఈ మెయిన్‌ ఫలితాలు మంగళవారం విడుదల కాగా.. జిల్లాకు చెందిన కాకతీయ జూనియర్‌ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన సిద్ధార్థ 99.74 శాతంతో జిల్లా మొదటి ర్యాంకు, సాత్విక్‌ 98.73 శాతంతో జిల్లా రెండో ర్యాంకు సాధించినట్లు కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్‌ రామోజీరావు పేర్కొన్నారు. అలాగే సాయి ఆకాష్‌ 98.20%, అస్మా పిర్దోష్‌ సిద్దికి 97.44%, భువనకుర్తి 97.42%, వైభవ్‌ 96.14%, వైష్ణవి 93.07%,ప్రశ్మరెడ్డి 92.73%, ఎం అరుణ్‌ 90.68%, ఎన్‌ లిఖిత 92.62%, ఎం రాజశేఖర్‌ 91.35%, నవనీత్‌ 90.27% సాధించారు. అలాగే ఐఐటీ అకాడమీకి 42 మంది కాకతీయ విద్యార్థులు అర్హత సాధించారు, ఈసందర్భంగా రామోజీరావు మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. జిల్లా స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా కాకతీయ విద్యార్థులు సత్తా చాటారని, మొదటి ప్రయత్నంలోనే నేరుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ప్రత్యేక ప్రణాళికలతో మరిన్ని ఫలితాలు సాధిస్తామని తెలిపారు.

వెక్టర్‌ కళాశాల జయకేతనం

నిజామాబాద్‌ అర్బన్‌: జేఈఈ మెయిన్స్‌ ఫలితాల్లో నగరంలోని వెక్టర్‌ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన ఆకుల ఆకాష్‌ 98.55%, దంతుల అక్షిత్‌ 97.29%, హర్షిత్‌ కులకర్ణి 95.34%, మణిదీప్‌ 92.49%, అక్షిత రెడ్డి 90.82%, భక్తుల సహర్ష 90.64% మార్కులు సాధించారు. కళాశాల నుంచి 17మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందని కళాశాల చైర్మన్‌ మధుసూదన్‌ తెలిపారు.

కామారెడ్డి జిల్లాలో..



తృప్తి శ్రీ హర్షిత్‌



సాయి విఘ్నేష్‌

కామారెడ్డి టౌన్‌: జేఈఈ మేయిన్స్‌ ఫలితాల్లో కామారెడ్డికి చెందిన శ్రీ హర్షిత్‌ అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్‌ చదువుతున్న శ్రీహర్షిత్‌ జేఈఈ మేయిన్స్‌లో 99.83శాతం మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించాడు. శ్రీ హర్షిత్‌ తల్లిదండ్రులు రాధిక, శ్రీనివాస్‌లు ప్రభుత్వ ఉపాధ్యాయులు. అలాగే కామారెడ్డిలోని రిట్‌జి కళాశాలలో చదువుతున్న కూకుట్ల సాయి విఘ్నేష్‌ 96.14 మార్కులు సాధించి రాష్ట్ర ర్యాంకు సాధించాడు.

పనులను వేగవంతం చేయాలి



పోతంగల్‌లో మన ఊరు - మన బడి పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ చిత్రామిశ్రా

- అడిషనల్‌ కలెక్టర్‌ చిత్రామిశ్రా
- పలు మండలాల్లో మన ఊరు– మన బడి పనుల పరిశీలన

కోటగిరి: కోటగిరి, పోతంగల్‌ ఉభయ మండలాల్లో కొనసాగుతున్న మన ఊరు –మన బడి పనులను వేగవంతం చేయాలని అడిషనల్‌ కలెక్టర్‌ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. పోతంగల్‌ మండల కేంద్రంలోని హైస్కూల్‌, ప్రైమరీ స్కూల్స్‌లో కొనసాగుతున్న పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఉభయ మండలాల్లో మోడల్‌ స్కూల్‌గా ఎంపికైన కొడిచర్ల, పోతంగల్‌ ప్రైమరీ స్కూళ్లలో మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ ఇంజనీర్‌ను ఆదేశించారు. రెండో ఫేజ్‌ లో మంజూరైన పనులను కూడా నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. మరో మూడురోజుల తర్వాత ఆయా బడులను సందర్శించి పనుల పురోగతిని సమీక్షిస్తానని వెల్లడించారు. సర్పంచ్‌ వర్ని శంకర్‌, మాజీ సర్పంచ్‌ సాధుల రమేష్‌, హెడ్‌ మాస్టర్‌ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఈవో నాగనాథ్‌, ఎంపీవో మారుతి ఉన్నారు.

సొసైటీ సీఈవో, క్లర్క్‌ సస్పెన్షన్‌కు తీర్మానం



నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో రాజు, క్లర్‌ భాస్కర్‌ సొసైటీ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని వీరిని విధుల్లో నుంచి తొలగించేందుకు మంగళవారం పాలకవర్గం తీర్మానించినట్లు సొసైటీ చైర్మన్‌ రవీందర్‌రెడ్డి తెలిపారు. సీఈవో రాజు రూ. 5.50లక్షలు, క్లర్‌ భాస్కర్‌ రూ.5లక్షల 10వేలు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. దీంతో సొసైటీ పాలకవర్గం డిసెంబర్‌ 12న డీసీవో సింహచలంకు లేఖ రాసి, వీరిని సస్పెండ్‌ చేయాలని కోరారు. అనంతరం సీఈవో, క్లర్కులు డబ్బులు గతనెలా జనవరి 31వరకు చెల్లిస్తామని పాలకవర్గానికి తెలిపారు. గడువు ముగిసినా వారు సొసైటీకి డబ్బులు చెల్లించలేదు. మళ్లీ ఈవిషయాన్ని డీసీవో దృష్టికి తీసుకెళ్లగా ఇద్దరిని సస్పెండ్‌ చేసేందుకు అనుమతులు ఇచ్చారు. ఈమేరకు మంగళవారం సొసైటీలో చైర్మన్‌ అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇద్దరిని విధుల్లో నుంచి తొలగిస్తూ తీర్మానం చేసి ఆమోదించారు. కాపీను డీసీవోకు పంపినట్లు చైర్మన్‌ తెలిపారు. మరో క్లర్క్‌ విక్రమ్‌కు సీఈవో బాధ్యతలు అప్పగిస్తు తీర్మానించినట్లు చైర్మన్‌ తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన ధర్మాబాద్‌ మాజీ కౌన్సిలర్లు



బీఆర్‌ఎస్‌ చేరిన మాజీ కౌన్సిలర్లతో జెడ్పీ చైర్మన్‌ విఠల్‌రావు, నాయకులు ఈగ గంగారెడ్డి తదితరులు

నిజామాబాద్‌నాగారం : జెడ్పీ చైర్మన్‌ విఠల్‌రావు ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన మాజీ కౌన్సిలర్లు నగరంలోని బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో మంగళవారం పార్టీలో చేరారు. జెడ్పీ చైర్మన్‌ విఠల్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్‌ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ధర్మాబాద్‌కు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారన్నారు. కేసీఆర్‌ ప్రధానమంత్రి కావడమే ధ్యేయమని, రాబోయే ధర్మాబాద్‌ పుర ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పారు. మాజీ కౌన్సిలర్లు అయ్యూబ్‌, దినేష్‌, రేర్‌ఖాన్‌, షేక్‌ ఇబ్రహీం, సాయినాథ్‌ నారాయణ్‌, శివసేన నాయకులు సునీల్‌ పెడికర్‌, మతం హన్మంతు, సయ్యద్‌ చాంద్‌ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి, కేసీఆర్‌ సేవాదళ్‌ జిల్లా అధ్యక్షుడు రమణారావు, బీఆర్‌ఎస్‌ నాయకులు ఈగ గంగారెడ్డి, మాణికేశ్వర్‌రావు పాల్గొన్నారు.

హిందూధర్మం కోసం ప్రచారం



కామారెడ్డి టౌన్‌: దేశంలో హిందూధర్మం కోసం ప్రచారం చేపడుతున్నట్లు ఇస్కాన్‌ ప్రచారకులు తెలిపారు. హైదరాబాద్‌ నుంచి రిషికేష్‌, హరిద్వార్‌ల మీదుగా చేపట్టిన ఇస్కాన్‌ ప్రచార బస్సు యాత్ర మంగళవారం కామారెడ్డికి చేరుకుంది. ఈసందర్భంగా వారికి విశ్వహిందూ పరిషత్‌, బీజేపీ నాయకులు ఘన స్వాగతం తెలిపారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కాటిపల్లి వెంకటరమణారెడ్డి జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండలంలో వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు.

లక్ష్మీనరసింహస్వామి జాతర ఆదాయం రూ. 1,63,930

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని జానకంపేట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగిన బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రూ.1,63,930 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్‌ పురం సాయిలు, ఈవో వేణు మంగళవారం తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చిన హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. ఆలయానికి హుండీ ద్వారా రూ.62,152, ప్రత్యేక అర్చన ద్వారా రూ.3,927, విరాళాల రూపంలో రూ.1,250, అన్నదానం సందర్భంగా వచ్చిన విరాళం రూ.2801, సత్యనారాయణ వ్రతం ద్వారా రూ.900, తైబజార్‌ ద్వారా రూ.11,700, పూజా సామగ్రి దుకాణాల ద్వారా రూ.39 వేలు, లడ్డు పులిహోర దుకాణం ద్వారా రూ.36 వేలు, సైకిల్‌ స్టాండ్‌ 6,200 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

వెల్‌నెస్‌ సెంటర్‌ తరలింపు ఎప్పుడో?

- తాత్కాలికంగా జీజీహెచ్‌లో ఏర్పాటు
- అవస్థలు పడుతున్న రిటైర్డు ఉద్యోగులు



ప్రభుత్వ ఆస్పత్రిలోని వెల్‌నెస్‌ సెంటర్‌

నిజామాబాద్‌ సిటీ: జిల్లాకేంద్రంలోని జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన వెల్‌నెస్‌ సెంటర్‌ను వేరే ప్రాంతానికి ఎప్పుడు తరలిస్తారోనని రిటైర్డ్‌ ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. గతంలో ధర్నాచౌక్‌ చౌరస్తా సమీపంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌ భవనంలో వెల్‌నెస్‌ సెంటర్‌ను ఏర్పాటు చేయగా.. మూడునెలల క్రితం ప్రభుత్వ భవనాల కూల్చివేతలో ఈ భవనాన్ని కూల్చివేశారు. దీంతో వెల్‌నెస్‌ సెంటర్‌ను జిల్లా ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలోని 4వ అంతస్తులోకి మార్చారు. అప్పటినుంచి రిటైర్డు ఉద్యోగుల కష్టాలు మొదలయ్యాయి. ప్రతి నెలా వెల్‌నెస్‌ సెంటర్‌కు మందులు, రక్తపరీక్షల కోసం వచ్చేవారు నాలుగు అంతస్తులు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో లిఫ్ట్‌ ఉన్నా.. ఎప్పుడూ కిక్కిరిసి ఉండటంతో ఉపయోగించుకోలేకపోతున్నారు. మెట్లు ఎక్కి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వారు వెల్‌నెస్‌ సెంటర్‌కి రావలంటేనే జంకుతున్నారు. అలాగే సెంటర్‌లో అన్ని రకాల మందులు లేకపోవడంతో పలువురు బయట కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది.

వేరే చోటుకి తరలించాలి..

ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్‌ సెంటర్‌ను బయట ఎక్కడైనా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. జీజీహెచ్‌లో గ్రౌండ్‌ఫ్లోర్‌లో వెల్‌నెస్‌ సెంటర్‌ ఏర్పాటు చేద్దామన్న వార్డులు ఖాళీగా లేవు. ఇప్పుడున్న వెల్‌నెస్‌ సెంటర్‌ పక్కన జీజీహెచ్‌ ఐసీయూ వార్డు ఉండటంతో వెల్‌నెస్‌ సెంటర్‌లో పనిచేసే వారు సైతం ఇక్కడ పనిచేస్తున్నారు. వెల్‌నెస్‌ సెంటర్‌ను న్యాల్‌కల్‌రోడ్డు రేడియో స్టేషన్‌ వెనకాల గల ఈఎస్‌ఐ ఆస్పత్రి ఆవరణలోకి మార్చేందుకు ప్రతిపాదించారు. కానీ ఇది కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండటంతో అనుమతి కోసం లేఖ పంపారు. ఇంకా ఎలాంటి అనుమతులు రాలేదు.

అనుమతి కోసం ఎదురుచూస్తున్నాం..

జీజీహెచ్‌లో మూడు నెలల క్రితం ఏర్పాటు చేసిన వెల్‌నెస్‌ సెంటర్‌తో అక్కడికి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నట్లు మా దృష్టిలో ఉంది. ప్రతినెలా మందులు తీసుకునేవారు, వివిధ పరీక్షల కొరకు వచ్చేవారు నాల్గో అంతస్తులోకి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. వెల్‌నెస్‌ సెంటర్‌ను కింది అంతస్తులోనే ఎక్కడ ఏర్పాటు చేసే అవకాశం లేదు. వెల్‌నెస్‌ సెంటర్‌ ఏర్పాటు కొరకు జీజీహెచ్‌ ఎదురుగ గల మెటర్నాటీ స్థలం అడుగుతున్నారు. పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

–డాక్టర్‌ ప్రతిమారాజ్‌, జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌

లిఫ్ట్‌ దొరకడం లేదు...



వెల్‌నెస్‌ సెంటర్‌ను ప్రభుత్వ ఆస్పత్రి నాల్గో అంతస్తులోకి మార్చడం వల్ల వృద్ధులు రావటం కష్టంగా మారింది. ప్రతి నెలా మందుల కోసం ఇక్కడకు రావాలంటే లిఫ్ట్‌ దొరక్క, మెట్లు ఎక్కుతూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆస్పత్రిలో నుంచి వెల్‌నెస్‌ను తక్షణమే మార్చాలి.

–నరేందర్‌, మహాలక్ష్మీనగర్‌

గంజాయి విక్రేత అరెస్ట్‌



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్న నగరానికి చెందిన ఎండీ యూనుస్‌ను మోపాల్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి 759 గ్రాముల 40 ప్యాకెట్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఏసీపీ కార్యాలయంలో మంగళవారం ఏసీపీ వెంకటేశ్వర్‌ వివరాలు వెల్లడించారు. ఎండీ యూనుస్‌పై గతంలోనే గంజాయి విక్రయిస్తున్న కేసులు నమోదయ్యాయి. ఒక కేసులో నాలుగేళ్ల జైలు శిక్షతోపాటు రూ.20వేల జరిమానా విధించారు. జైలు నుంచి విడుదలైన యూనుస్‌ మళ్లీ అదే బాట పట్టాడు. ఐదురోజుల క్రితం 10 ప్యాకెట్లను విక్రయించగా, విశ్వసనీయ సమాచారం మేరకు గంజాయి సేవిస్తున్న యువకులను పట్టుకుని విచారించారు. తాజాగా మంగళవారం మరో 40 ప్యాకెట్లు కంజర్‌లోనే విక్రయించేందుకు వస్తుండగా, మోపాల్‌లో మజీద్‌ వద్ద రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.15వేల వరకు ఉంటుంది. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సౌత్‌ రూరల్‌ సీఐ నరేష్‌, మోపాల్‌ ఎస్సై మహేష్‌, ఏఎస్సై రమేష్‌, కానిస్టేబుల్‌ మోహన్‌ గౌడ్‌ను సీపీ అభినందించారు.

క్రైం కార్నర్‌

విద్యార్థిని అదృశ్యం

వేల్పూర్‌: మండలంలోని జాన్కంపేట్‌ శివారులోని కస్తూర్బా స్కూలు వద్ద తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్‌కుమార్‌ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థినిని సోమవారం ఆమె కుటుంబసభ్యులు స్కూలుకు తీసుకువచ్చారు. తమ కుటుంబసభ్యులను ఒకసారి కలిసి వస్తానని టీచరుకు చెప్పి బయటకు వెళ్లిన సదరు విద్యార్థిని తిరిగి స్కూలులోకి వెళ్లలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. విద్యార్థిని పెద్దమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు పోలీసులు తెలిపారు. విద్యార్థిని ఎవరికైనా కనిపిస్తే 87126 59862కు సమాచారం అందించాలన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వీఆర్‌ఏ ఆత్మహత్య



దేవరాజ్‌ (ఫైల్‌)

దోమకొండ: మండలంలోని అంచనూరు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ మన్నె దేవరాజ్‌(32) మంగళవారం ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌ తెలిపారు. వివరాలు ఇలా.. దేవరాజ్‌ గత కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈక్రమంలో సోమవారం జీవితంపై విరక్తి చెంది ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని రాగి కుంటలో శవమై తేలాడు. మృతుడి భార్య భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. ప్రభుత్వం పేస్కేలు అమలు చేయకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తోటి వీఆర్‌ఏలు ఆవేదన వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సదాశివనగర్‌: మండల కేంద్రం శివారులో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై రాజేష్‌ తెలిపారు. సదాశివనగర్‌ శివారులోని వ్యవసాయ భూమిలో శవం కనిపించదని, మృతదేహంపై ఎలాంటి దుస్తులు లేవని, మతిస్థిమితం లేని వ్యక్తిగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లుగా తెలిపారు. మృతుడు 40– 50 ఏళ్ల మధ్య ఉంటాడని, మూడు రోజుల క్రితం మృతిచెందినట్లు పేర్కొన్నారు.

బ్యాంక్‌లో చోరీకి విఫలయత్నం



నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ రూరల్‌ మండలం ఖానాపూర్‌ గ్రామం ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఓ దుండగుడు చోరీకి విఫలయత్నం చేశాడు. బ్యాంక్‌ సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సోమవారం అర్ధరాత్రి వేళ దుండగుడు బ్యాంక్‌ వెనకాల గల కిటికీలోనుంచి లోపలికి ప్రవేశించి, ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి డబ్బులు చోరీకి యత్నించి విఫలమయ్యాడు. అనంతరం స్ట్రాంగ్‌రూంను తెరిచేందుకు కొంత ధ్వంసం చేశాడు. కాని డోర్‌ తెరుచుకోకపోవటంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం బ్యాంక్‌ తెరిచిన సిబ్బంది లోపల వస్తువులు చిందరవందరగా ఉండటం చూసి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నరేష్‌, ఎస్సై లింబాద్రిలు బ్యాంక్‌ను పరిశీలించారు. అలారం పనిచేయకపోవడంపై బ్యాంక్‌ సిబ్బందిని ప్రశ్నించారు. సీసీ పుటేజీలను పరిశీలించగా చోరీకి వచ్చింది ఒక్కరేనని గుర్తించారు. మేనేజర్‌ సురేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



కొండల్‌రెడ్డి (ఫైల్‌)

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్‌ గ్రామంలో విద్యుత్‌షాక్‌తో ఒక రైతు మృతి చెందినట్లు భిక్కనూరు పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన బైని కొండల్‌రెడ్డి (43) మంగళవారం వేకువజామున పొలానికి నీరు పెట్టేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అతడి సోదరుడు బాపురెడ్డి పొలం వద్దకు వెళ్లి చూడగా స్టార్టర్‌ బాక్స్‌ వద్ద కొండల్‌రెడ్డి మృతిచెంది ఉన్నాడు. స్టార్టర్‌ బాక్స్‌లో ఫ్యూజ్‌ వైర్‌ సరిచేస్తుండగా షాక్‌ తగిలి మరణించినట్లు గుర్తించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కాలువలో జారిపడి ఒకరి..



వివరాలు సేకరిస్తున్న ఏఎస్సై ఆనంద్‌ సాగర్‌

రుద్రూర్‌: మోస్రా మండలం తిమ్మాపూర్‌ శివారులోని సాగర్‌ కాలువలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన సున్నం రమేష్‌ (36) సోమవారం కాలువ సమీపంలో పశువుల గడ్డి కొస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో జారిపడ్డాడు. చీకటి పడుతున్న రమేష్‌ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలిస్తుండగా రాత్రి కాలువలో మృతదేహమై కనిపించాడు. గడ్డి కోస్తున్నప్పుడు ఫిట్స్‌ రావడంతో కాలువలో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మంగళవారం పోలీసులకు సమాచారం అందగా.. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం బోధన్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి హన్మాండ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సీఐ ప్రేమ్‌కుమార్‌ తెలిపిన వివరాలు ఇలా.. బోధన్‌ మండలంలోని పెంటఖుర్దు గ్రామానికి చెందిన శరణు సందీప్‌(26) బోధన్‌లో హోటల్‌ నిర్వహిస్తున్నాడు. రాత్రి అతడు బైక్‌పై బోధన్‌ నుంచి నాగన్‌పల్లి వైపు వెళుతుండగా యాసిన్‌ వాటర్‌ సర్వీసింగ్‌ పాయింట్‌ సమీపంలో బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈఘటనలో సందీప్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బావ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ..

నందిపేట్‌ (ఆర్మూర్‌): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయ పడగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నందిపేటకు చెందిన వెలుమల చిన్నయ్య (52) మద్దెపల్లి గ్రామ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గత నెల 26న బైక్‌పై అతడు నిజామాబాద్‌కు వెళ్తుండగా.. ఎదురుగా లారీ వచ్చి ఢీకొట్టింది. ఈప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. సోమవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

నిజామాబాద్‌ నగరంలో..

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నెంబర్‌ –1 వద్ద మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండటంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై ప్రణయ్‌ తెలిపారు. అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు 40–45ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. మృతుడి సంబంధికులు వివరాల కోసం రైల్వే పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు.

వాషింగ్‌మిషన్‌ పేలిన ఘటనలో..

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని ఓ ఇంట్లో గత నెల వాషింగ్‌మిషన్‌ పేలి ఇద్దరు వృద్ధ దంపతులు తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇంటి యజమాని బాలయ్యతో పాటు అతని భార్య బాలలక్ష్మికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటన జరిగిన రెండు రోజులకే బాలయ్య(70) హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని భార్య బాలలక్ష్మీ (67) ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఆమెకు హైదరాబాద్‌లోనే పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌హెచ్‌ఓ నరేష్‌ తెలిపారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు



అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలుతున్న క్షతగాత్రులు

భిక్కనూరు: మండలంలోని బీటీఎస్‌ చౌరస్తా వద్ద మంగళవారం ఓ ఆటో బోల్తా పడటంతో ఆరుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. కామారెడ్డి నుంచి భిక్కనూరు వైపు వస్తున్న ఆటో టైర్‌ అకస్మాత్తుగా పేలడంతో డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముత్యంపేటకు చెందిన కుమ్మరి రాంచంద్రం, అంతంపల్లికి చెందిన లక్ష్మి, స్రవంతి, విజయ, జమున శ్యామలకు గాయాలయ్యాయి. వెంటనే వారిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వివరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి..

మాక్లూర్‌: మాణిక్‌భండార్‌ చౌరస్తా వద్ద మంగళవారం రాత్రి రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనగా తీవ్రంగా గాయపడ్డారు. సదరు వ్యక్తిని నిజామాబాద్‌ నుంచి ఆర్మూర్‌ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

తప్పు ఒకరిది.. జరిమానా మరొకరికి..

సదాశివనగర్‌: కొందరు వాహనదారులు ట్రాఫిక్‌ చలానా నుంచి తప్పించుకోవడానికి తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారు. దీంతో ఒకరు చేసిన తప్పుకు మరొకరికి జరిమానా చెల్లించవలసి వస్తోంది. ఇలాంటి ఘటన మండలకేంద్రంలో మంగళవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన మంగళి నర్సింలుకు టీఎస్‌సీ 7878 నంబర్‌ గల సీడీ డీలక్స్‌ బైకు ఉంది. కామారెడ్డిలోని ఓ వ్యక్తికి టీఎస్‌ 17డి 7878 నంబర్‌పై ఫ్యాషన్‌ప్రో బైక్‌ ఉండగా.. తన నెంబర్‌లోని డీని సీగా మార్చాడు. దీంతో నర్సింలుకు విత్‌ఔట్‌ హెల్మెట్‌ కింద జరిమానా రావడంతో అవాక్కయ్యాడు. ఆన్‌లైన్‌లో ఫొటో చూడగా.. తన బైక్‌ లేదని, నంబర్‌ మార్చడంతో జరిమానా వచ్చిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇలాంటి ఘటనలపై కఠినంగా వ్యవహరించాలని కోరాడు.